# తత్త్వమసి

ముకుందరావు గడియారం ముళ్ళవంక చూస్తూ కూచున్నాడు. నిన్న న్యూస్ చెబుతున్నప్పుడొచ్చి వాచర్ సరిచేసి పోయినా మళ్ళీ తప్పుటైం చూపిస్తోంది గడియారం. అసలు సరైనటైం చూపించడం గడియారం బాధ్యత; కాని చూపించకపోవడం వస్తుతః దానితప్పు కాదంటోంది ముకుందరావు మనస్సు—

నలుగురి ఉపయోగానికీ కార్పొరేషన్ వాళ్లు టవర్ కట్టించి దానిమీద ప్రతిష్ఠ చేసిన గడియారం తప్పుతునడక నడవడం మంచిదికానిమాట వాస్తవమే. ఉబుసుపోకకువచ్చే జనంకోసం రేడియో ఎనిమిదిన్నరవరకూ మ్రోగుతూఉండాలి. అంతవరకూ వాచర్ అక్కడ ఉండితీరాలి. మొన్నొకరోజున తొందరపనిఉండి, మళ్లీ రావడానికి బద్ధకంవేసి వాచర్ గడియారం ముళ్లు అరగంటముందుకు తిప్పాడు. తనైతే, మొన్న చూశాడుగాని యిదివరకెన్నిసార్లలా జరిగిందో! వాచరే గడియారానికి తప్పుటైం చూపించడం నేర్పాడనిపించింది—

చిన్నప్పుడు చదువుకోడంకన్నా ఆడుకోవడమెక్కువ అవసరమనిపించేది ముకుందరావుకి. అయిదింటికిగాని బయటికి కదలడానికి వీల్లేదని దగ్గరుండి వాళ్ళమ్మ చదివించుతుంటే ఆటలమీద ధ్యాసతో చదివేవాడు. చదువుకుంటాడులేఅని ఆవిడ యేమరి ఉన్నప్పుడు ముకుందరావు కొన్నిసార్లు గడియారంముళ్లు అనుకూలంగా త్రిప్పుకొని అయిదు కాకమునుపే జట్టుతో కలిసినరోజులున్నాయి. వాళ్ళనాన్న యింటికివచ్చినాక రిస్టువాచ్ చూసి 'వెధవ గడియారం' అని ఆవిడ గడియారాన్ని తిట్టేది. అది జ్ఞాపకమొచ్చింది ముకుందరావుకి—

'ముకుందం అలా చూస్తు కూచున్నావేరా? వేరుశనక్కాయలన్నీ అయిపోతున్నాయి. చివరకు చెక్కుమిగుల్తుంది' అన్నాడు గోపాలం. ముకుందరావు ఓ కాయ ఒలిచి నోట్లో వేసుకున్నాడు. పార్కులోజనం అప్పుడే పలచబడుతున్నారు.

రేపు మళ్ళీ కంపోజిటర్లకు మేటరిచ్చుకోవాలి. రాసినకథ తనకు నచ్చలేదని మార్చమన్నాడు ఛీఫ్ఎడిటర్. ముకుందరావు శాంతిప్రియుడుకావడంతో ప్రతిదేశ సమస్యలోను అమెరికా జోక్యం కలిపించుకోడం అతనికిష్టంలేదు పైగా సైంటిస్టులు డబ్బుకోసం యాటంబాంబులు సృష్టించి యుద్ధాలకు తోడ్పడుతున్నారంటాడు. అనేవిషయాలు తీసుకొని అమెరికా పాలసీని ఖండిస్తూ కథరాశాడు. డైరక్టర్ల బోర్డులో ఎక్కువమంది అమెరికన్లు కావడంవల్ల ఆ కథ మార్చాల్సివచ్చింది. ఇక రాత్రికి కూచొని ఆపనిచేయాలి.

'గోపాలం, ఇహ మనమూ లేద్దాం' అన్నాడు ముకుందరావు. ఇద్దరూ బయల్దేరి శృంగాటకంవద్ద విడిపోయారు

అన్నం తిని రాయడం మొదలెట్టాడు. కళ్ళల్లోకి లైటు పొడుచుకుంటోంది, ఆర్పేయండి అని నసుగుతూ భార్య పక్కన కూచొని 'రాసిందేరాస్తున్నా రెందుకూ' అని దీర్ఘంతీసింది. పత్రికవాళ్లు తనని నెలజీతానికి కొనుక్కున్నారు గనుక— ముకుందరావు జర్నలిస్టయినందుకు గోపాలం మురిసిపోతాడు. ముకుందరావు భార్యకూడా 'మావారు పత్రికలో పని చేస్తున్నారు. కథలు బాగారాస్తారు'అని చెప్పుకుంటూ ఉంటుంది. ముకుందరావు చిన్నప్పట్నుంచీ కథలు రాయడంలో సరదాపడి చేయితిరిగిన రచయితయ్యాడు. అతనికదితప్ప యింకేం చేతకాదు. మొదటొక చోట గుమాస్తాగాచేరి చేతకాదనిపించుకొని బయటికి వచ్చాడు. గోపాలం పరపతితో యిప్పుడు ముకుందరావు తను పని చేస్తున్న పత్రికలో కథాశాఖ ఎడిటరయ్యాడు.

సాయంత్రం పార్కులో కూచున్నప్పుడు నువ్వు మంచి 'ఆర్టిస్టు' వురా అన్నాడు గోపాలం. భావమీదా భవాల మీదా ముకుందరావు కవాతు చెయ్యగలగడం ఎకౌంట్స్ అంకెల్లో మునిగిపోయే గోపాలానికి స్వేచ్ఛగల జీవనమనిపించింది. తనకు స్వేచ్ఛలేదనీ గుమస్తా జీవితం మహారోతఅనీ గోపాలం యేకరువు పెట్టాడు. తప్పుటైం చూపించడం నేర్చుకున్న గడియారంముళ్ళకేసి చూస్తూ ముకుందరావు ఊం కొట్టాడు. గోపాలం మాటల మధ్యలో 'డబ్బుకోసం ఒళ్ళమ్ముకున్నాన్రా? ఆ కుర్చీలో కూచొని కూచొని నడుం పీక్కుపోతోంది గాని మా హెడ్ వదిలిపెట్టడు' అన్నాడు. ప్రెస్‌లో కంపోజిటర్లుకూడా 'సత్తువ అమ్ముకుంటున్నామండి, నిల్చొని నిల్చొని కాళ్లుపీక్కుపోతాయి' అంటారు. ఇంకోళ్లకోసం యాటంబాంబులు తయారు చేసే సైంటిస్టుకూడా 'నా విజ్ఞానం, అమ్ముకున్నాను, పరిశోధనలు చేసీ చేసీ మెదడు నీరసపడిపోతోంది' అనుకుంటాడేమో!" -

ఆలోచించి కథమారుస్తుంటే తనుకూడా ఆర్టును అమ్ముకుంటున్నట్లు ముకుందరావుకు తట్టింది. జర్నలిస్టంటే నలుగుర్నీ సరైనమార్గంలో పెట్టే రచనలు చేస్తాడు గనుక అందరికంటే గొప్పవాడని గోపాలం అంటూంటే నిజమే ననుకుంటూ వచ్చిన

శ్రీ పి. యస్. ఆర్ ఆంజనేయశాస్త్రి

ముకుందరావు నీరసపడిపోయాడు. గుమాస్తాలాగా, కంపోజిటర్‌లాగా, యాటంబాంబులు చేసే సైంటిస్టులాగా తను కూడా తనచేతైనపనికి విలువకట్టి అమ్ముకుంటున్నాడు...

నీరసపుఘాటు తగ్గినాక మళ్లీ కలం పట్టాడు ముకుందరావు.

జీతపురాళ్లు రావడానికి కళను అమ్మక తప్పదు. అవి వస్తేనే డొక్కాడుతుంది. డొక్కాడితేనే తనలో కళ పుడుతుంది. పుట్టినకళను అమ్మితేనే జీతపురాళ్లొస్తాయి—ఇదొక విషస్ సర్కిల్.

ఉంకోపని చేత కాక కళ ఒక వృత్తిగా మార్చుకున్న ముకుందరావుకు తనది కమ్మర్షియల్ ఆర్టయిపోయిందని బెరుకుపుట్టింది. కలం ఆగిపోయింది. తను బతకడంకోసం పత్రికకు నచ్చేకథలు రాయాలి. పూర్వకవులుకూడా నానారాజసందర్శనం చేసి అడ్డమైన పొగడ్తలూ పొగిడినవిషయం జ్ఞాపకంవచ్చి కమ్మర్షియల్ ఆర్టుకు తను ఆదిపురుషుడు కాకపోవడంవల్ల కొంత తేరుకున్నాడు. నలుగురికోసం రచనలు చేయాల్సిన ముకుందరావు తనకు జీతపురాళ్లిస్తున్న వారికోసమే రచనలు చేయాల్సిరావడంలో తనతప్పేమీ లేదనుకుంటూ కథపూర్తిచేశాడు.



MANUFACTURERS
THE INDIA CANNING INDUSTRIES LTD
VIJAYAVADA-2
Madras & South Contact
Sovereign Sales Agency Ltd.
11-12 Second Line Beach, Madras 1

నిన్న సరిచేసినా ఇవాళ మళ్ళీ తప్పుచూపడం వస్తుతః గడియారం తప్పు కాదంటోంది అతని మనస్సు.



వాచర్ కోసం తప్పుటైంచూపిస్తున్న పార్కు గడియారంముల్లు అతని మెదడులో గిరగిరా తిరిగాయి.

ముకుందరావు లైటార్పి నడుం వాల్చాడు. మెదడు మసకపడడంతో నిద్ర రాలా. ఇష్టంలేని భావాలతో రచనలు చెయ్యడం ముకుందరావుకి జీతపురాళ్లిస్తున్న వాళ్లు నేర్పుతున్నారు. అలాగే కొన్నాళ్లు జరిగితే తనలోలేని భావాలను ఊహించుకొని నలుగుర్నీ దారితప్పించే రచనలు చెయ్యడం అతని కలవాటైపోతుంది. గుండె గుబుక్కుమంది ముకుందరావుకి. బతికేవాళ్ల తప్పులను బతికించేవాళ్లు బాధ్యులు. ఎంతకళను అమ్ముకున్నా తను రచయితేనని పించింది ముకుందరావుకు. ఊహు... ముకుందరావు తప్పుచెయ్యడంలేదు—

ఆలోచిస్తూ పడుకున్న ముకుందరావుకు

(43-వ పేజీ చూడండి)

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.
ఓ. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి-నెల్లూరు జిల్లా.

## తత్త్వమసి

(౫-వ పేజీ తరువాయి)

పార్కులో గడియారం ఆరుగంటలు కొట్టడం వినిపించింది. ఇంకా చీకటిగానే ఉంది, ఆరయిందా? అనుకుంటూ ప్రక్క వాటావాళ్ళ గడియారం కిటికీలోంచి తొంగిచూశాడు. ముప్పావుగంట తక్కువగా ఉంది. వాచర్ కోసం తప్పుటైం చూపించడం నేర్చుకున్న గడియారం బహిరంగంగా అందరికీ తప్పుటైం చూపించడం నేర్చుకుంది. ఎంత తప్పుటైం చూపించినా అది గడియారమే. గడియారాన్ని తిడుతూనే అది గడియారం తప్పుకాదని ముకుందరావు నమ్మాడు.

సాయంత్రం పార్కులో గోపాలం కలిశాడు. గోపాలంతో సరీగ్గామాట్లాడకుండా ముకుందరావు తప్పుటైం చూపిస్తున్న గడియారంముళ్ళవంక చూస్తూ కూచున్నాడు. 'ఏమిటాలోచిస్తున్నావు, ఆ గడియారం తప్పు తిరుగుతూ ఉంటుందిరా' అన్నాడు గోపాలం.

'మన వేదాంతులు తత్త్వమసి అన్నారు.. నిజమే'

ముకుందరావు అన్నది గోపాలానికి కొత్తగా తోచింది.

'తత్త్వమసి. అదీ నువ్వూ ఒక్కటేనంటోంది నా మనస్సుకూడా' అన్నాడు మళ్ళీ ముకుందరావు పార్కు గడియారం వంక చూస్తూనే.

గోపాలంమాత్రం 'యిట్లా చాలా గడియారాలు పాడైపోతున్నాయిలేరా' అని ఏదో మాటాడబోయాడు. ★

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, పవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ గోదావరి.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి



పీపుల్స్ వారి 'పల్లెటూరు'లో చంద్రం (ఎన్. టి. రామారావు) కాబోయే మామ సాంబయ్య (కోడూరు అచ్చయ్య)తో సరాగాలాడుతూ గూడ వేస్తున్నాడు